# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రజాస్వామ్యం కేవలం వ్యవస్థలపైనే కాకుండా ప్రధాన విలువలపైనా అభివృద్ధి చెందుతుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.
- దేశంలో ఐక్యతకు రాజ్యాంగమే మూల స్తంభమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- తాకట్టు లేని వ్యవసాయ రుణాల పరిమితిని లక్షా 60 వేల రూపాయల నుంచి 2 లక్షల రూపాయలకు పెంచుతున్నామని ఆర్‌బీఐ ఈ రోజు ప్రకటించింది.
- రానున్న 10 సంవత్సరాల్లో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 3 రెట్లు పెరుగుతుందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.
- రానున్న రెండు, మూడు రోజుల్లో వాయువ్య, మధ్య భారతదేశంలో తీవ్రమైన చలిగాలుల పరిస్థితులు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది.

==============================

దేశంలో ఐక్యతకు రాజ్యాంగమే మూల స్తంభమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఈరోజు లోక్‌సభలో భారత రాజ్యాంగం 75 సంవత్సరాల ఉజ్వల ప్రయాణంపై జరిగిన ప్రత్యేక చర్చలో ప్రధానమంత్రి పలు అంశాలను ప్రస్తావించారు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ విశిష్ట లక్షణమని, ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు దేశ ఐక్యతను బలోపేతం చేసే దిశగానే ఉన్నాయని అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేశామని, ఒక దేశం.. ఒకే పన్ను.. జిఎస్‌టిని అమలు చేశామని అన్నారు. రాబోయే సంవత్సరాల్లో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని ప్రధానమంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 44 సెకన్లు)

==============================

జాతీయ రాజధాని ప్రతి సంవత్సరం ఎదుర్కొంటున్న ప్రమాదకర పర్యావరణ పరిస్థితులకు పరిష్కారాన్ని కనుగొనాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈ రోజు నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్స్ 2024 ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గడ్డి పొట్టు దహనానికి వ్యవస్థాగత పరిష్కారాన్ని కనుగొనాలని, ఆ బాధ్యతను వ్యక్తులకు వదిలేయకూడదన్నారు. వనరులు, శక్తిని సరైన పద్ధతిలో వినియోగించే బాధ్యత పౌరులకు ఉండాలని అభిప్రాయపడ్డారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్... సబ్‌కా విశ్వాస్... సబ్‌కా ప్రయాస్... మంత్రంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల ఉజ్వల ప్రయాణంపై ఈరోజు లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ.... రాజ్యాంగాన్ని రూపొందించడంలో డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. దేశంలో మైనారిటీలపై ఎలాంటి వివక్ష లేదని, భారత్ లో వారికి చట్టపరమైన రక్షణ లభిస్తోందని ఆయన ఉద్ఘాటించారు. దేశంలోని ఆరు మైనారిటీ వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశామని పేర్కొంటూ..

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న 10 సంవత్సరాల్లో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 3 రెట్లు పెరుగుతుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఇండియా ఎకనామిక్ కాన్ క్లేవ్ లో జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.... భారతదేశం తన అంతరిక్ష రంగాన్ని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా పెంచే మార్గంలో ఉందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారతదేశ అంతరిక్ష రంగం 8 నుండి 9 శాతం వాటాను కలిగి ఉందని తెలిపారు. 2035 నాటికి భారత్‌కు సొంత అంతరిక్ష కేంద్రం ఉంటుందని కేంద్రమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తాకట్టు లేని వ్యవసాయ రుణాల పరిమితిని లక్షా 60 వేల రూపాయల నుంచి 2 లక్షల రూపాయలకు పెంచుతున్నామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ రోజు ప్రకటించింది. వచ్చే సంవత్సరం జనవరి 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఈ మేరకు వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. రైతులకు మెరుగైన ఆర్థిక సహకారాన్ని అందించడం, వారి కార్యాచరణ, అభివృద్ధి అవసరాలను తీర్చేందుకు తగినంత వనరులు సమకూర్చడం ఈ నిర్ణయం లక్ష్యమని ఆ ప్రకటనలో పేర్కొంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజాస్వామ్యం కేవలం వ్యవస్థలపైనే కాకుండా ప్రధాన విలువలపైనా అభివృద్ధి చెందుతుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఇండియన్ పోస్ట్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్ అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ సర్వీస్ 50వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి పాల్గొని మాట్లాడారు. ఆధునిక ప్రజా సేవకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని సూచించారు. మార్పును సులభతరం చేసేవారు, సాంప్రదాయ పరిపాలనా సరిహద్దులను అధిగమించాలని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 36 సెకన్లు)

అలాగే కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ... గత ఐదు దశాబ్దాలలో ఇండియన్ పోస్ట్స్, టెలికమ్యూనికేషన్స్, అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ సర్వీస్ భారతదేశ కలను సాకారం చేస్తున్నాయని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నావికా దళ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి 4 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఈ రోజు ఇండోనేషియా చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా దేశ అత్యున్నత స్థాయి ప్రభుత్వ, రక్షణ అధికారులతో ద్వైపాక్షిక చర్చల్లో ఆయన పాల్గొంటారు. భారత్ - ఇండోనేషియా మధ్య ద్వైపాక్షిక రక్షణ సంబంధాలను మరింత పటిష్టం చేసుకునేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ పర్యటన సాగుతుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు, మూడు రోజుల్లో వాయువ్య, మధ్య భారతదేశంలో చలిగాలుల నుండి తీవ్రమైన చలిగాలుల పరిస్థితులు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. జమ్మూ-కశ్మీర్, లడఖ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో చలిగాలులు వీస్తాయని వెల్లడించింది. ఇదిలా ఉండగా, ఈరోజు, రేపు ఢిల్లీ - జాతీయ రాజధాని ప్రాంతంలో ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని, అర్ధరాత్రి వేళల్లో పొగమంచు ఉంటుందని ఐఎండీ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బోర్డర్ గవాస్కర్ టెస్ట్ క్రికెట్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా-భారత్ మధ్య బ్రిస్బేన్ గబ్బా స్టేడియంలో మూడవ టెస్ట్ మ్యాచ్ ఈరోజు ప్రారంభమైంది. అయితే వర్షం ఆటకు చాలా సార్లు అంతరాయం కలిగించింది. దీంతో తొలిరోజు కేవలం 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖవాజా 19 పరుగులతో, నాథన్ మెక్‌స్వీనీ 4 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. మ్యాచ్ రేపు అరగంట ముందుగా ప్రారంభమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =